జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 162 | శనివారం 8 నవంబర్- 2025 | పేజీలు : 4 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## వందేమాతరం ఒక మంత్రం.. తరతరాలకు స్ఫూర్తి: ప్రధాని మోదీ

### వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాలను ప్రారంభించిన ప్రధాని మోదీ



### స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించిన ప్రధాని

వందేమాతరం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని వ్యాఖ్య

దేశవ్యాప్తంగా ఏడాది పాటు కొనసాగనున్న వేడుకలు

పౌరులు తమ గళంతో వందేమాతరం పాడి పంపేందుకు డిజిటల్ పోర్టల్ ప్రారంభం

2 లో

## భారతదేశం భయంతోనో, ఒత్తిడితోనో ఏ అడుగు వేయదు: రాజ్‌నాథ్‌సింగ్

(సందేశం టైమ్స్) అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాకిస్థాన్ అణు పరీక్షలు చేయబోతోందన్న వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం భయం లేదా ఒత్తిడితో ఏ అడుగు వేయదని, ఇతర దేశాలు ఏం చేయాలను కుంటున్నాయో చేయనివ్వాలని అన్నారు. భారతదేశం సముచితమని భావిస్తే,



సరైన సమయంలో సరైన చర్య తీసుకుంటుందని, భవిష్యత్ మాత్రమే దీనిపై చెబుతుందని ఆయన పేర్కొన్నారు.

## కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్ట్..



(సందేశం టైమ్స్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీవ్ర విషాదాన్ని కలిగించిన కర్నూలు జిల్లా బస్సు అగ్నిప్రమాదం కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ ఘోర దుర్ఘటనకు సంబంధించి ప్రధాన నిందితులలో ఒకరైన వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను కర్నూలు పోలీసులు శుక్రవారం రోజున అరెస్ట్ చేశారు. అయితే, కోర్టులో హాజరుపరిచిన వెంటనే ఆయనకు బెయిల్ మంజూరు కావడంతో విడుదలయ్యారు.

మిగతాది 2లో

## శ్రీచరణికి ఏపీ సర్కార్ భారీ నజరానా...

# రూ. 2.5 కోట్లు, గ్రూప్-1 ఉద్యోగం

### మహిళల ప్రపంచకప్ విజేత శ్రీచరణిపై ఏపీ ప్రభుత్వం వరాల జల్లు

- రూ. 2.5 కోట్ల నగదు, గ్రూప్-1 ఉద్యోగం, కడపలో ఇంటి స్థలం ప్రకటన
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో భేటీ అయిన శ్రీచరణి, మిథాలీ రాజ్
- గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన మంత్రులు, ఏసీఏ పెద్దలు

(సందేశం టైమ్స్) మహిళల వన్డే ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన తెలుగమ్మాయి, క్రికెటర్ శ్రీచరణిపై ఏపీ ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. ఆమెకు రూ. 2.5 కోట్ల నగదు బహుమతి, గ్రూప్-1 స్థాయి ప్రభుత్వ ఉద్యోగం, సొంత జిల్లా కడపలో 1,000 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఏపీ సీఎంఓ ట్వీట్ చేసింది. అలాగే మంత్రి లోకేశ్ కూడా ఈ విషయమై 'ఎక్స్' వేదికగా ప్రత్యేకంగా పోస్టు పెట్టారు. "శ్రీచరణి అచంచల అంకితభావం ఆంధ్రప్రదేశ్‌ను గర్వపడేలా చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమె అద్భుతమైన విజయాన్ని గ్రూప్-1 ప్రభుత్వ ఉద్యోగం, రూ. 2.5 కోట్ల నగదు బహుమతి, కడపలో నివాస స్థలంతో సత్కరిస్తుందని ప్రకటించడానికి సంతోషంగా ఉంది" అంటూ మంత్రి లోకేశ్ పోస్ట్ చేశారు.అంతకుముందు శ్రీచరణి, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌తో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను



2 లో

## పరకామణి కేసులో దోషులు జైలుకెళ్లక తప్పదు: భానుప్రకాష్ రెడ్డి

విజయవాడ, (సందేశం టైమ్స్) : పరకామణి కేసు పై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డికీలక వ్యాఖ్యలు చేశారు. పరకామణి విషయంలో దోషులు జైలుకెళ్లక తప్పదని హెచ్చరించారు. దొంగను దాతగా చేశారని... దొంగతనాన్ని కానుకగా మార్చారని ఆరోపించారు. ఇప్పుడు కరుణాకర్ రెడ్డి అండ్ కో నీతిమంతుల్లాగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇవాళ(శుక్రవారం) విజయవాడ వేదికగా మీడియాతో మాట్లాడారు భానుప్రకాష్ రెడ్డి.పరకామణి విషయంలో దొంగలను తీసుకెళ్లి లోకాయుక్తలో కరుణాకర్ రెడ్డి ఎలా రాజీ చేస్తారని ప్రశ్నించారు. శ్రీనివాసుడు ఉగ్ర నరసింహుడు అయ్యారని.. తన ఖజానాను దోచుకున్న కరుణాకర్ రెడ్డి అండ్ కోని శ్రీవారు కచ్చితంగా శిక్షిస్తారని వార్నింగ్ ఇచ్చారు భానుప్రకాష్ రెడ్డి.

## ఉనికి కోల్పోతానన్న భయంతోనే అసత్యాలు..

### జగన్‌పై మంత్రి సీరియస్

ప్రకాశం, (సందేశం టైమ్స్) : మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్‌కు రైతుల మీద ప్రత్యేకమైన ప్రేమ పుట్టుకొచ్చిందంటూ ఎద్దేవా చేశారు. జగన్ అధికారంలో ఉన్న సమయంలో ఏ ఒక్క రైతును కూడా పరామర్శించ లేదని గుర్తుచేశారు. మొంథా తుఫానును ఎదుర్కొనేందుకు సీఎం చంద్రబాబు



నాయుడు అహర్నిశలు పని చేశారని తెలిపారు. తుఫాను సమయంలో ప్రభుత్వం బాగా పని చేసిందని ప్రతి ఒక్కరూ మాట్లాడుతున్నారనన్నారు.

## పల్లె రోడ్ల స్థితిగతులపై కొత్త సిస్టమ్: ఉప ముఖ్యమంత్రి



(సందేశం టైమ్స్) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పల్లె ప్రజలకు శుభవార్త చెప్పారు. పల్లెల్లో రోడ్ల స్థితిగతులు, నిర్మాణ నాణ్యత, పనుల పురోగతి గురించి ప్రజలకు నేరుగా తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం' ను తీసుకురానుంది. ఈ సాంకేతిక వేదిక ద్వారా గ్రామీణ రహదారుల ప్రతి వివరమూ డిజిటల్ రూపంలో అందుబాటులోకి రానుంది.పల్లెపండగ 2.0లో భారీ రోడ్ల నిర్మాణం పవన్ కళ్యాణ్ వెల్లడించిన వివరాల ప్రకారం, పల్లెపండగ 2.0 కార్యక్రమంలో ?2,123 కోట్ల సాస్కీ నిధులతో 4007 కిలోమీటర్ల రహదారులు, గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లు నిర్మించనున్నారు. ఈ నిర్మాణ పనులు కేవలం మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసమే కాకుండా, పల్లె ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడానికి కూడా ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

## జగన్ హయాంలో ప్రాజెక్టుల నిర్వాహణని గాలికొదిలేశారు..

### సీఎం చంద్రబాబు ఫైర్

అమరావతి,(సందేశం టైమ్స్) జగన్ మోహన్ రెడ్డి హయాంలో ప్రాజెక్టుల నిర్వాహణని గాలికొదిలేశారని, కనీసం గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. 2014 నుంచి 2019 మధ్య లో వ్యవసాయ రంగంలో జీఎస్డీపీ 6 శాతం పైగా పెరిగిందని.. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జీఎస్డీపీ మళ్లీ పడిపోయిందని ఆక్షేపించారు. తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన కౌలు రైతులకు పెట్టుబడి రాయితీ



ఇస్తున్నామని తెలిపారు.

మిగతాది 2లో

## ఈ ఏడాది తిరుమల వైకుంఠ ద్వార దర్శనంపై టీటీడీ ప్రకటన

(సందేశం టైమ్స్) : శ్రీవారి భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే వైకుంఠ ద్వార దర్శనం తేదీలను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీ నుంచి 2026 జనవరి 8వ తేదీ వరకు పది రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనున్నట్లు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం జరిగిన 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. దర్శనానికి సంబంధించిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టోకెన్ల జారీ విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.భక్తుల సౌకర్యార్థం అంగ ప్రదక్షిణ టోకెన్ల జారీ విధానంలోనూ కీలక మార్పు చేసినట్లు ఈవో ప్రకటించారు. ఇప్పటివరకు అమలులో ఉన్న డిప్ విధానాన్ని రద్దు చేసి, 'ముందు వచ్చిన వారికి ముందు' ప్రాతిపదికన టోకెన్లు కేటాయించ నున్నట్లు స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ఆన్‌లైన్ ద్వారా అమల్లోకి వస్తుందని ఆయన వివరించారు.భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు శ్రీవాణి, ఇతర దర్శన టోకెన్ల జారీ విధానాన్ని సమీక్షించేందుకు టీటీడీ బోర్డు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు.

తిరుమలలో డిసెంబర్ 30 నుంచి వైకుంఠ ద్వార దర్శనం


అంగ ప్రదక్షిణ టోకెన్ల జారీలో డిప్ విధానం రద్దు

వచ్చే ఫిబ్రవరి నుంచి ఆన్‌లైన్‌లో అంగ ప్రదక్షిణ టోకెన్లు

దర్శన టోకెన్ల విధానంపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ

శ్రీవాణి నిధులతో 5 వేల భజన మందిరాల నిర్మాణం

నవంబర్ 17 నుంచి తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



2లో

# శ్రీచరణికి ఏపీ సర్కార్ భారీ నజరానా...
# రూ. 2.5 కోట్లు, గ్రూప్-1 ఉద్యోగం

వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో శ్రీచరణిని అభినందించిన చంద్రబాబు, ప్రపంచకప్ గెలిచి దేశానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. మహిళా క్రీడాకారులకు శ్రీచరణి ఆదర్శంగా నిలిచారని, ఎంతోమందికి స్ఫూర్తినిస్తారని కొనియాడారు. ప్రపంచకప్ గెలిచిన ఆనంద క్షణాలను శ్రీచరణి సీఎం, మంత్రితో పంచుకున్నారు.

ఈ సందర్భంగా శ్రీచరణి మాట్లాడుతూ... ప్రపంచకప్ గెలిచిన తర్వాత దేశ ప్రజలు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు చూపిస్తున్న అభిమానానికి చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తన కుటుంబం అందించిన ప్రోత్సాహమే తనను ఈ స్థాయికి తీసుకొచ్చిందని, ముఖ్యంగా తన మామ తనను క్రికెట్ ఆడేందుకు ఎంతగానో ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యంలో శిక్షణ పొందానని చెప్పారు. ఈ విజయం మొదటి అడుగు మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని లక్ష్యాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసినప్పుడు ఆయన భవిష్యత్ కార్యాచరణపై విలువైన సలహాలు ఇచ్చారని పేర్కొన్నారు.

ఇక, ఇవాళ సాయంత్రం కడపలో ఏసీఏ, కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీచరణికి భారీ సన్మాన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# వందేమాతరం ఒక మంత్రం..
# తరతరాలకు స్ఫూర్తి: ప్రధాని మోదీ

భారత జాతీయ గీతం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏడాది పాటు జరిగే ఉత్సవాలను ప్రధాని నరేంద్ర మోదీ ఈరోజు ఘనంగా ప్రారంభించారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన వందేమాతరం స్మారక నాణెం, పోస్టల్ స్టాంపును ఆవిష్కరించారు. ఈ గీతం దేశ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని, తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉందని ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "నవంబర్ 7 ఒక చారిత్రకమైన రోజు. వందేమాతరం 150 ఏళ్ల మహోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ పవిత్ర సందర్భం కోట్లాది మంది భారతీయులలో కొత్త స్ఫూర్తిని, శక్తిని నింపుతుంది. వందేమాతరం అనేది కేవలం ఒక పదం కాదు, అది ఒక మంత్రం, ఒక శక్తి, ఒక కల, ఒక సంకల్పం. ఇది మనల్ని మన చరిత్రతో అనుసంధానిస్తుంది. మన ఆత్మవిశ్వాసాన్ని పెంచి, మనం సాధించలేని కల ఏదీ లేదని గుర్తుచేస్తుంది" అని తెలిపారు. మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన వీరులకు ఆయన నివాళులర్పించారు.కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సంగ్రామానికి స్ఫూర్తినిచ్చిన గీతాన్ని స్మరించుకోవడం గర్వంగా ఉందన్నారు. "ప్రాణత్యాగం చేసిన వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు చివరిగా పలికిన మాట వందేమాతరం అయి ఉంటుంది. వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడానికి భారతీయులందరినీ ఏకం చేయగల శక్తి వందేమాతరానికి ఉంది" అని ఆయన అన్నారు. పౌరులు తమ గళంతో వందేమాతరం పాడి పంపేందుకు ఒక డిజిటల్ పోర్టల్‌ను కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు.ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 9:50 గంటలకు దేశవ్యాప్తంగా ప్రజలు ఉన్నచోటనే సామూహికంగా వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించారు. పాఠశాలలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో పౌరులు ఉత్సాహంగా పాల్గొని ఢిల్లీలోని ప్రధాన కార్యక్రమంతో గొంతు కలిపారు.చారిత్రక నేపథ్యం 1875 నవంబర్ 7న అక్షయ నవమి పర్వదినాన బంకించంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని రచించారు. ఆయన రాసిన ప్రఖ్యాత నవల 'ఆనందమఠం'లో భాగంగా ఈ గీతం తొలిసారిగా 'బంగదర్శన్' అనే పత్రికలో ప్రచురితమైంది. మాతృభూమిని శక్తికి, సౌభాగ్యానికి ప్రతీకగా వర్ణించిన ఈ గీతం, అనతికాలంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమానికి, ముఖ్యంగా స్వదేశీ ఉద్యమానికి ప్రధాన నినాదంగా మారింది. భాషా, ప్రాంతీయ భేదాలను అధిగమించి జాతీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. 19వ శతాబ్దపు బెంగాల్ మేధావులలో ఒకరైన బంకించంద్ర ఛటర్జీ ఆధునిక భారత జాతీయవాద స్ఫూర్తిని రగిలించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ ఉత్సవాలు 2026 నవంబర్ 7 వరకు కొనసాగుతాయి.

### జగన్ హయాంలో ప్రాజెక్టుల నిర్వాహణని గాలికొదిలేశారు..
### సీఎం చంద్రబాబు ఫైర్

పంటల బీమా ప్రీమియం కూడా జగన్ ప్రభుత్వం చెల్లించలేదని ధ్వజమెత్తారు. దీంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో ప్రీమియం సకాలంలో చెల్లించామని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు.

రైతులకు పంటల బీమా చెల్లింపులో ఇబ్బంది లేకుండా చేశామని చెప్పుకొచ్చారు. కౌలు రైతులు ఎక్కువ భూమిలో వ్యవసాయం చేస్తున్నారని.. నష్టాలు వస్తే ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. ఇవాళ(శుక్రవారం) ఆచార్య ఎన్జీ రంగా జయంతి సభ జరిగింది. ఈ సభలో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతితో పాటు వందేమాతరం 150 వసంతాల వేడుకలు ఒకే రోజు రావటం చరిత్ర అని అభివర్ణించారు. ఆచార్య ఎన్జీ రంగా 33 ఏళ్ల వయస్సులో ఆంధ్రా రైతాంగ ఉద్యమాన్ని నడిపించారని కొనియాడారు. 1964లో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పార్లమెంట్‌లో ఆచార్య ఎన్జీ రంగా పోరాడారని కీర్తించారు. ప్రాంతాలకు అతీతంగా నాలుగుచోట్ల ఎంపీగా గెలిచిన చరిత్ర ఆచార్య ఎన్జీ రంగాది అని ప్రశంసించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రముఖుల్లో ఎన్జీ రంగా ఒకరని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. ఆర్థిక శాస్త్రంలో నైపుణ్యత సాధించిన రంగా.. మహాత్మాగాంధీ పిలుపుతో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని నొక్కిచెప్పారు. సైమన్ కమిషన్ గో బ్యాక్, క్విట్ ఇండియా ఉద్యమంలో ఆచార్య ఎన్జీ రంగా పాల్గొన్నారని కీర్తించారు. కేవలం 33 ఏళ్ల వయసులో ఆంధ్రా రైతాంగ ఉద్యమాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. రైతులకు శిక్షణా పాఠశాల పెట్టి శిక్షణ అందించారని ఉద్ఘాటించారు. ఓవైపు దేశం కోసం మరో వైపు రైతుల కోసం ఆచార్య ఎన్జీ రంగా పోరాడారని నొక్కిచెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా పార్లమెంట్‌లో ఉన్నంత కాలం రైతులు సుభిక్షంగా ఉంటారని నెహ్రూ వంటి వారు చెప్పారని ఉద్ఘాటించారు. ఆచార్య ఎన్జీ రంగా చేసిన పోరాటాలకు పద్మ విభూషణ్‌తో పాటు ఎన్నో అవార్డులు వచ్చాయని కీర్తించారు. తాను మొదటిసారి సీఎం కాగానే వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆచార్య ఎన్జీ రంగా పేరు పెట్టానని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు.

# కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్ట్..

గత నెల అక్టోబర్ 24న హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రయాణిస్తున్న కావేరి ట్రావెల్స్‌కు చెందిన ఓ ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురైంది. కర్నూలు జిల్లాలోని ఉలిందకొండ మండలం చిన్నటేకూరు సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న ఓ ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.ఈ భయంకరమైన ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన రమేష్ అనే ప్రయాణికుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.బస్సు యజమానికి బెయిల్ మంజూరుఈ కేసులో పోలీసులు ఇప్పటికే బస్సు డ్రైవర్ మిర్యాల లక్ష్మయ్యను ( నిందితుడు) అరెస్ట్ చేశారు. తాజాగా, బస్సు యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను నిందితుడుగా) పేర్కొంటూ అరెస్ట్ చేసి, ప్రత్యేక మొబైల్ కోర్టు ముందు హాజరుపరిచారు.

# వందేమాతర గీతానికి 150 ఏళ్లు: అనంతగిరిలో మానవహారం, సామూహిక ఆలాపన




అనంతగిరి,07 %అశీజ% 2025 : జాతీయ స్వాతంత్ర్య ఉద్యమంలో అపారమైన పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అనంతగిరి గ్రామ ప్రజలు, విద్యార్థులు, పోలీసులు అపూర్వమైన రీతిలో నివాళులర్పించారు.

వందేమాతర గీతం స్ఫూర్తిని, సందేశాన్ని నేటి తరానికి అందించాలనే ఉద్దేశంతో శివాలయం సెంటర్ వద్ద ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మానవహారం రూపంలో నిలబడి, సామూహికంగా వందేమాతరాన్ని ఆలాపించారు.

ముఖ్య అంశాలు:

పోలీసుల భాగస్వామ్యం: అనంతగిరి పోలీసులు ఈ కార్యక్రమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించేందుకు పోలీసుల సహకారం ఎంతగానో తోడ్పడింది.

విద్యార్థులు, ఉపాధ్యాయులు: పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. త్రివర్ణ పతాకాలతో కూడిన దుస్తులు ధరించి, ఉత్సాహంగా గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వారి ముఖాల్లో దేశభక్తి ఉప్పొంగింది.

గ్రామస్తుల మద్దతు: పోలీసులు, విద్యార్థులతో పాటు గ్రామంలోని తదితర ప్రముఖులు, ప్రజలు కూడా ఈ చారిత్రక ఘట్టంలో భాగమయ్యారు.

సామూహిక ఆలాపన: వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించడం ద్వారా, దేశభక్తి భావన అందరిలోనూ బలంగా ప్రతిధ్వనించింది. యువతకు, పెద్దలకు జాతీయ సమైక్యత సందేశాన్ని అందించింది.

ఈ సందర్భంగా మాట్లాడిన అనంతగిరి మండలం ఎస్సై నవీన్ కుమార్ "వందేమాతరం కేవలం ఒక పాట కాదు, అది మన జాతి ఆత్మ. 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ గీతం స్వాతంత్ర్య పోరాటంలో అసంఖ్యాకమైన మందికి ప్రేరణగా నిలిచింది. ఈరోజు మనమంతా కలిసి ఈ గీతాన్ని ఆలపించడం మన దేశభక్తికి నిదర్శనం" అని అన్నారు.ఈ కార్యక్రమం అనంతగిరి గ్రామంలో దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా, రాబోయే తరాలకు ఈ గీతం యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేశారు. వందేమాతరానికి ఘనమైన నివాళిగా ఈ కార్యక్రమం నిలిచింది.

# అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం: రాష్ట్ర స్థాయి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం - చివరి తేదీ నవంబర్ 15

సూర్యాపేట జిల్లా: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం-2025 సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ప్రదానం చేయబోయే పురస్కారాల కోసం సూర్యాపేట జిల్లాలోని అర్హులైన దివ్యాంగుల వ్యక్తులు మరియు సంస్థల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహా రావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పురస్కారాలను వ్యక్తిగత మరియు సంస్థాగత కేటగిరీల కింద అందిస్తారు.

పురస్కార కేటగిరీలు:

వ్యక్తిగత కేటగిరి:

దివ్యాంగుల సాధికారత కోసం పనిచేస్తున్న అత్యుత్తమ వ్యక్తి.

రోల్ మోడల్.

దివ్యాంగుల అత్యుత్తమ సృజనాత్మకత కలిగిన బాలుడు/బాలిక.

లిఅత్యుత్తమ పునరావాస నిపుణులు/సిబ్బంది (వైకల్య రంగంలో పనిచేస్తున్న వారు).

. సంస్థాగత వర్గం:

దివ్యాంగుల సాధికారత కోసం పనిచేస్తున్న అత్యంత అత్యుత్తమ సంస్థ.

దివ్యాంగుల కోసం పనిచేసే ప్లేస్‌మెంట్ ఏజెన్సీ.

ముఖ్యమైన వివరాలు:

దరఖాస్తు సమర్పించడానికి చివరి తేదీ: 2025 నవంబర్ 15, సాయంత్రం 5:00 గంటల లోపు.

ఎక్కడ దరఖాస్తు చేయాలి: మహిళ, శిశు , దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం, సూర్యాపేట ఆఫీసు నందు.

దరఖాస్తు ఫారం %డ% మార్గదర్శకాలు: అర్హులైన వ్యక్తులు మరియు దివ్యాంగుల కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు పైన పేర్కొన్న కేటగిరీల వారీగా దరఖాస్తు ఫారం మరియు మార్గదర్శకాల కోసం కింది వెబ్‌సైట్‌లను సందర్శించాలని అధికారి సూచించారు:

* %https://wdsc.telangana.gov.in https://wdsc.telangana.gov.in/Notifications/Guidelines%20for%20State%20Awards.pdf

దరఖాస్తులను జిల్లా సంక్షేమ అధికారి ద్వారా హైదరాబాద్‌లోని డైరెక్టర్‌కు పంపించి, రాష్ట్ర స్థాయి ఎంపిక కమిటీ తుది పరిశీలన చేసి విజేతలను ఎంపిక చేస్తుందని తెలిపారు. ఇతరా వివరాలకై కార్యాలయ పనివేళల్లో జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు దివ్యాంగుల వయో వృద్ధుల మరియు ట్రాంజెండర్స్ సంక్షేమ శాఖ-సూర్యాపేట గారిని సంప్రదించవచ్చు.

# వందేమాతరం జాతీయ గీతం 150 వసంతాలు
## జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమం





సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 7:భారత స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తిదాయకమైన జాతీయ గీతం వందే మాతరం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ పోలీసు సిబ్బందితో కలిసి వందే మాతరం గీతాన్ని ఆలపించారు.

ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎస్పీ గారు తెలిపారు. వందేమాతరం జాతీయ గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025 నవంబర్ 7 నుండి 2026 నవంబర్ 7 వరకు దేశవ్యాప్తంగా స్మారక కార్యక్రమాలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. అందులో భాగంగానే ఈ రోజు ఉదయం 10 గంటలకు జిల్లా పోలీసు కార్యాలయంలో సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించామన్నారు.ఎస్పీ మాట్లాడుతూ, వందే మాతరం గీతాన్ని బంకిమ్ చంద్ర చటర్జీ గారు 1875లో రచించారని, "వందే మాతరం" అంటే "మాతృభూమికి వందనం" అనే అర్థమని తెలిపారు. ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో భారతీయులలో దేశభక్తి జ్వాలను రగిలించిన నినాదమని అన్నారు. 1905లో బెంగాల్ విభజన సమయంలో ప్రజలు "వందే మాతరం" నినాదంతో బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలు నిర్వహించారని, బాల గంగాధర తిలక్, లాలా లజపతరాయ్, అరవిందఘోష్, బిపిన్ చంద్ర పాల్ వంటి నేతలు ఈ గీతాన్ని ప్రజల్లో విస్తృతంగా పాడించారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యం అనంతరం 1950 జనవరి 24న రాజ్యాంగ సభ "వందే మాతరం" ను జాతీయ గీతంగా గుర్తించిందన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్ రావ్, ఎఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్స్పెక్టర్లు రమేష్, కిరణ్ కుమార్, నాగేశ్వర్ రావ్, ఆర్ఐలు రామారావ్, రాజశేఖర్ రెడ్డి, డానియేల్, శ్రీనివాస్ రావ్, కార్యాలయ సూపరింటెండెంట్లు అశోక్, మోహనప్ప, అలాగే డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు

# జిల్లా స్థాయిలో ఘనంగా యువజనోత్సవాలు: యువకళాకారుల ఎంపిక



సూర్యాపేట: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లాలో శుక్రవారం, తేది: 07-11-2025 న జిల్లా స్థాయి యువజనోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేట నందు ఉదయం 10:00 గంటల నుండి యువకళాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ. కె. సీతారాంరావు, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) గారు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత కేవలం విద్యలోనే కాకుండా ఇతర రంగాలలో కూడా రాణించాలని ఉద్బోధించారు. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కొప్పుల వేణా రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, సూర్యాపేట, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి శ్రీ. బి. వెంకట్ రెడ్డి, మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య గారు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు:

యువజనోత్సవాలలో జానపద నృత్యం (గ్రూప్), జానపద పాటలు (గ్రూప్), ఉపన్యాసం, వ్యాస రచన, పోస్టర్ తయారీ (పెయింటింగ్), కథా రచన, మరియు సైన్స్ మెళా వంటి అంశాలలో పోటీలు నిర్వహించడం జరిగింది. అన్ని విభాగాలలో ప్రధమ, ద్వితీయ మరియు తృతీయ స్థానాలు సాధించిన వారికి జ్ఞాపికలు (మేమేంటోలు) మరియు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.

అంశాల వారీగా విజేతల వివరాలు:

అంశం ఎ ప్రధమ స్థానం ఎ ద్వితీయ స్థానం ఎ తృతీయ స్థానం ఎ

జానపద నృత్యం (గ్రూప్) TGTWRDC, సూర్యాపేట ZPHS, ఏనుబాముల Polytechnic College, Suryapet

జానపద పాటలు (గ్రూప్) | TGTWRJC, చివ్వేంల ZPHS, కోదాడ ZPHS, జలాల్ పురం ఎ

ఉపన్యాసం | A R Shariya, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేట Krishitha, Polytechnic college, సూర్యాపేట B. Mahanthi, TGTWURJC, చివ్వేంల

కథా రచన T. Anitha, TGTWRDC, సూర్యాపేట | T. Harshini, Polytechnic, సూర్యాపేట M. Bhuvaneshwari, TTWRDC, సూర్యాపేట ఎ




పెయింటింగ్ | M. Ridhirna, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేట P. Keerthana, Polytechnic College, సూర్యాపేట | D. Lohitha, TGTWVRJC, చివ్వేంల

వ్యాస రచన R. Saritha, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేట K. Supriya, Polytechnic, Suryapet | T. Gurudeep kour, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేట ఎ

సైన్స్ మెళా ZPHS, కోదాడ ZPHS, ఏనుబాముల ZPHS, జలాలపూర్

బి. వెంకట్ రెడ్డి
జిల్లా యువజన మరియు క్రీడల అధికారి
సూర్యాపేట జిల్లా.

# వివాహ వేడుకకు హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు



సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి నవంబర్ 7హైదరాబాద్: భాగ్యనగరం లోని సుచిత్ర ఎల్.వి కన్వెన్షన్ లో శుక్రవారం జరిగిన కుర్తివాడ గ్రామానికి చెందిన రిపోర్టర్ మన్నే రవీందర్,లావణ్య కూతురు వివాహనికి టివైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డా. తనుగుల జితేందర్ రావు హాజరై నూతన వధూవరులను శ్రీ వర్ష,శ్రీనివాస్ రావు ను ఆశీర్వదించారు. ఈసందర్భంగా మెదక్ జిల్లా,పాపన్నపేట మండల రిపోర్టర్లు..కిరణ్,మధుసూదన్,స్వామి,కృష్ణ,భాస్కర్ చారీ,లక్ష్మణ్,దయానంద్,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా కైవల్య రెడ్డి ఎంపిక

నిడదవోలు (తూర్పు గోదావరి) :నవంబరు 7 (సందేశం టైమ్స్) : అమెరికాలోని ఫ్లోరిడాకు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్స్ స్పేస్ ఇండిస్టీస్ 2029లో చేపట్టబోయే అంతరిక్షయాత్రలో పాల్గొనేందుకు ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన కైవల్యరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు తమకు సమచారం వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆస్ట్రోనాట్ అభ్యర్థి ఎంపిక ప్రక్రియ చాలా క్లిష్టతరమైనదని, కఠినమైన ఇంటర్వ్యూ ప్రక్రియ అనంతరం ఆమె ఎంపికైనట్లు తెలిపారు. టైటాన్ స్పేస్ ఇండిస్టీస్ నాలుగేళ్ల కఠినమైన ఆస్ట్రోనాట్ శిక్షణను కైవల్యకు అందించనున్నారు. నాసాలో మూడు దశాబ్దాల అనుభవం కలిగిన, 224 రోజులు అంతరిక్షంలో గడిపి, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం కమాండర్‌గా ఆరు నెలలు సేవలందించిన



నాసా వెటరన్ ఆస్ట్రోనాట్ టిఎస్ఐ ఛీఫ్ ఆస్ట్రోనాట్ విలియం బిల్‌మెక్ ఆర్థర్, బ్రెజిల్ తొలి వ్యోమగామి టిఎస్ఐ డిప్యూటీ ఛీఫ్ ఆస్ట్రోనాట్ మార్కోస్ పోంటెస్, వంటి అంతర్జాతీయ నిపుణుల మార్గదర్శకత్వంలో శిక్షణ పొందనుందన్నారు. తనను ఆస్ట్రోనాట్ అభ్యర్థిగా ఎంపిక చేసిన టైటాన్స్ స్పేస్ ఇండిస్టీస్‌కు కైవల్య రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో దేశం గర్వించదగిన వ్యోమగామిగా, ఖగోళ శాస్త్రవేత్తగా సేవలందిస్తానని ఆమె తెలిపారు.

# వందేమాతరం గీతం ఆలపించడం మనకు దొరికిన మంచి అవకాశం: అదనపు కలెక్టర్ కె. సీతారామారావు



సూర్యాపేట: వందేమాతరం గీతం ఆలపించటం మనకు దొరికిన మంచి అవకాశమని అదనపు కలెక్టర్ కె. సీతారామారావు అన్నారు. వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సూర్యాపేటలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు కలెక్టరేట్‌లోని ఉద్యోగస్తులందరితో కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయానికి నేటితో 150 సంవత్సరాలు పూర్తయ్యాయని గుర్తు చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తిని నింపి, రణ నినాదంగా ఈ గీతం ఎంతగానో ఉపయోగపడిందని ఆయన అన్నారు. బెంగాలీలో రచించిన ఈ గేయం తెలుగులో “భారతమాత నీకు వందనం, గలగల పారే ప్రవాహాలతో మలయ మారుతముల చల్లని గాలులతో, సస్యశ్యామలమైన దేశమా నీకు వందనాలు...” అని భారతదేశాన్ని కీర్తిస్తూ రచించబడిందని తెలిపారు. బెంగాల్ విభజన జరిగిన తర్వాత వందేమాతరం ఇంకా ప్రసిద్ధి చెందిందని, ఈ గీతం నేటికి కూడా అఖండ భారతదేశంలో ప్రతి ఒక్కరి నోట పలుకుతుండడం మన అదృష్టం అని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నరసింహ, గిరిజన సంక్షేమ అధికారి శంకర్, స్త్రీ, శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు సాయి, శ్రీలత, టీఎన్జీవోస్ జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. జారీ చేసిన వారు: జిల్లా పౌర సంబంధాల అధికారి, సూర్యాపేట.

# వాస్తవ సాగుదారులనే నమోదు చేయాలి



అమరావతి బ్యూరో :నవంబరు 7 (సందేశం టైమ్స్) : తుపాను పంట నష్టం వివరాల నమోదులో వాస్తవ సాగుదారులను నమోదు చేయాలని, పంట నష్టం అంచనాకు గడువు పెంచాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ క్రాప్ నమోదు యాప్‌కు ఎడిట్ ఆప్షన్ ఇచ్చి వాస్తవ సాగుదారులైన రైతులను నమోదు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబులు ఒక ప్రకటనలో కోరారు. మొంథా తుపాను వల్ల ఆస్తి నష్టం పెద్దగా జరగకపోయినా పంట నష్టం అధికంగా జరిగిందన్నారు. పత్తి, మిర్చి, అరటి, బొప్పాయి వంటి తోటలు, కూరగాయల సాగు చేసే రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అయినప్పటికీ నష్టపోయిన కౌలు రైతుల పేర్లు నమోదు చేయడంలో అన్యాయం జరిగిందన్నారు. పాలకుల దుర్మార్గపు నిర్ణయాల వల్ల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందలేదని, గుర్తింపు కార్డులు లేని కౌలు రైతుల పేర్లను ఈ క్రాప్‌లో నమోదు చేయడం లేదన్నారు. పంట సాగు చేయని రైతుల పేర్లతోనే ఈ క్రాప్ నమోదు జరిగిందని తెలిపారు. కౌలు రైతులు పెట్టుకున్న అర్జీలను పరిగణలోకి తీసుకుని పంట పోలాలను పరిశీలించి నష్టాన్ని నమోదు చేయాలన్నారు.

# వీధి కుక్కల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 7నవంబర్ న్యూఢిల్లీ, : దేశవ్యాప్తంగా వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రహదారులపైకి కుక్కలు, పశువులు రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం సూచించింది. ఈ మేరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశిస్తూ, డ్రైవ్ అమలుపై 8 వారాల్లో స్టేటస్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించింది. అదేవిధంగా, పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆసుపత్రులు వంటి ప్రజాసంస్థల్లోకి వీధి కుక్కలు రాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపింది. వీధి కుక్కల నియంత్రణ, సంరక్షణపై అమికస్ క్యూరీ సమర్పించిన నివేదికను యథాతథంగా అమలు చేయాలని స్పష్టంగా పేర్కొంది. నివేదిక అమలుపై అఫిడవిట్ దాఖలు చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ప్రజల భద్రతతో పాటు జంతు హితాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రాలు సమతుల్య విధానంతో ముందుకు సాగాలని సూచించింది.

# మద్యం ప్రియులకు షాక్..

# నాలుగు రోజులు వైన్స్ బంద్

హైదరాబాద్, నవంబరు 7(సందేశం టైమ్స్) :జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో 4 రోజుల పాటు వైన్స్ బంద్ కానున్నాయి. నవంబర్ 9 సాయంత్రం 6 గంటల నుంచి నవంబర్ 12 సాయంత్రం 6 గంటల వరకు వైన్ షాపులు మూసివేయనున్నారు. ఓట్ల లెక్కింపు రోజు నవంబర్ 14న ఉదయం నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు, అవసరమైతే రిపోల్ రోజు కూడా మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఎక్సైజ్ చట్టం 1968లోని సెక్షన్ 20 ప్రకారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతీ ఆదేశాలు జారీ చేశారు.నత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న అన్ని వైన్ షాపులు, కల్లు దుకాణాలు సహా రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు, స్టార్ హోటల్స్, రిజిస్టర్డ్ క్లబ్‌లలోని బార్లు మూసివేయనున్నారు. ప్రజాప్రతినిధుల చట్టం 1951 లోని సెక్షన్ 135-%జ% ప్రకారం ఈ ఆదేశాలు జారీ చేయబడ్డాయని కమిషనర్ తెలిపారు.నవంబర్ 11న పోలింగ్ జరుగనున్న ఈ బైపోల్ లో 58 మంది అభ్యర్థులు పోటీపడుతున్నట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు. మొత్తం 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. 81 మంది అభ్యర్థులు అర్హత పొందారు. అయితే ఈసారి ఇంత మంది ఎన్నికల్లో పోటీ చేయడం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి. 2009 ఎన్నికల్లో 13 మంది, 2014 ఎన్నికల్లో 21 మంది, 2018 ఎన్నికల్లో 18 మంది పోటీపడగా.. 2023లో జరిగిన ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. వారిలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. ఇటీవల ఆయన హఠాన్మరణంతో ఈ ఉపఎన్నిక జరుగుతోంది.ఈ ఉపఎన్నికలో ప్రధాన పార్టీలు హోరాహోరీగా పోటీ పడుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ తరఫున నవీన్ యాదవ్ ఎన్నికల బరిలో నిలువగా.. బీఆర్ఎస్ పార్టీ తరఫున మాగంటి గోపీనాథ్ భార్య, మాగంటి సునీత పోటీ చేయనున్నారు. బీజేపీ పార్టీ తరఫున లంకల దీపక్ రెడ్డి ఎన్నికల బరిలో నిలిచారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో గెలిచి మరోసారి తమ సత్తా నిరూపించుకోవాలని చూస్తోంది. తమ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించి పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు బీఆర్ఎస్ యోచిస్తోంది. అటు గత అసెంబ్లీ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాల్లో విజయం సాధించిన బీజేపీ పార్టీ, ఈ స్థానంలో గెలిచి పార్టీ బలం మరింత పెంచే దిశగా కసరత్తు చేస్తోంది. ముగ్గురు అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు.

# శ్రీచైతన్య ఉద్యోగుల రక్తదానం



హైదరాబాద్,నవంబరు 7(సందేశం టైమ్స్) : శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదిన వేడుకల సందర్భంగా సంస్థ ఉద్యోగులు రక్తదానం చేశా రు. ఈ వేడుకలు దేశవ్యాప్తంగా అన్ని శ్రీచైతన్య కాలేజీల్లో జరిగాయి. మొత్తం 3,127 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. మియాపూర్‌లోని క్యాంపస‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొని చైర్‌పర్సన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా ఉద్యోగులు రక్తదానం చేయడంపై అభినందించారు. దేశవ్యాప్తంగా రక్తం కొరత తీవ్రం గా ఉందని, ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా లక్షలాది మంది విద్యార్థులను ఐఐటీయన్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, సివిల్ సర్వెంట్లుగా తీర్చిదిద్దడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. సామాజిక సేవలోనూ తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. విజయవాడలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శ్రీచైతన్య డైరెక్టర్ టి.నాగేంద్రకుమార్ ప్రారంభించారు.

# కట్టు కాలువ.. ఆగని కన్నీళ్లు.. ఇటీవలి వర్షాలకు

# వెన్కేపల్లి తుమ్మల చెరువుకు భారీ వరద

**ఉధృత ప్రవాహానికి రెండుచోట్ల తెగిన కాలువ**

**దిగువన ఏడు గ్రామాల్లో మునిగిన పొలాలు**

**సుమారు రెండువేల ఎకరాల్లో పంట నష్టం**

**ఇంకా నీళ్లలోనే పొలాలు.. ఆందోళనలో రైతులు**



సైదాపూర్, నవంబరు 7(సందేశం టైమ్స్) : రైతన్నకు దెబ్బమీద దెబ్బ తగులుతున్నది. ఓ వైపు సర్కారు ప్రోత్సాహం లేక ఆగమైతుంటే, మరోవైపు ప్రకృతి ప్రకోపానికి కోలుకోలేని నష్టం జరుగుతున్నది. ఇటీవల మొంథా తుపాన్ రైతులను నిండా ముంచగా, సైదాపూర్ మండల రైతులను అయితే కోలుకోకుండా చేసింది. కోతకు వచ్చిన వరిని నీట ముంచి తీవ్ర నష్టం మిగిల్చింది. మండల కేంద్రంలోని వెన్కేపల్లి తుమ్మల చెరువుకు భారీ వరద వచ్చింది. చెరువు నిండి మత్తడి దూకడంతో పాటు కట్టుకాలువ గుండా నీరు ప్రవహించింది. ఆ ప్రవాహదాటికి కట్టుకాలువ రెండు చోట్ల తెగింది. నీరు దిగువకు పోటెత్తడంతో మొదట సైదాపూర్ ఎల్లమ్మగుడి సమీపంలో కొనుగోలు కేంద్రంలోని వడ్లు కొట్టుకుపోయాయి. %అలాగే వెన్కేపల్లి, సైదాపూర్, జాగీర్‌పల్లి, ఆరెపల్లి, వెన్నంపల్లి, సోమారం, లస్మన్నపల్లి గ్రామాల్లో సుమారు 2వేల ఎకరాల్లో పొలాలు దెబ్బతిన్నాయి. సైదాపూర్– రాయికల్, సైదాపూర్– హుజూరాబాద్, సైదాపూర్ %–% మొలంగూర్ రహదారులు దెబ్బతిన్నాయి. కాగా, కాలువ తెగి వారం గడుస్తున్నా వరద ప్రవాహం తగ్గకపోవడంతో వందలాది ఎకరాల్లో ఇంకా నీరు నిలిచే ఉండగా, కండ్ల ముందే పంటలు దెబ్బతినడం చూసి రైతులు కంటతడి పెడుతున్నారు. వానలు పడ్డ ప్రతిసారి ఎగువనుంచి వచ్చే వరదకు కట్టుకాలువ తెగడంతో పంట పొలాలు మునిగి నష్టపోతున్నామని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# నీ కొడుకుని కిడ్నాప్ చేసినం..

# రూ.50 వేలు ఫోన్‌పే చెయ్



హుజూరాబాద్ రూరల్,నవంబరు 7 (సందేశం టైమ్స్) : 'నీ కొడుకును కిడ్నాప్ చేసినం. వెంటనే 50 వేలు ఫోన్ పే చెయ్' అంటూ హుజూరాబాద్ పట్టణ సమీపంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన మాసాడి లక్ష్మణ్‌రావుకు పాకిస్థాన్‌కు చెందిన సిరీస్ నంబర్ నుంచి ఫేక్ కాల్ వచ్చింది. దీంతో ఆందోళన చెందిన ఆయన హైబీపీతో దవాఖానలో చేరాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. %లక్ష్మణ్‌రావు కొడుకు అమెరికాలో ఉంటున్నాడు. అయితే, ఈ నెల 2న లక్ష్మణ్‌రావుకు ఫేక్ కాల్ రావడంతో వెంటనే కొడుకుకు ఫోన్ చేశాడు. అక్కడ రాత్రి కావడంతో స్పందించ లేదు. దీంతో హుటాహుటిన పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. మరోసారి ఫోన్ రావడంతో హై బీపీ వచ్చి పడిపోయాడు. పోలీసులు స్పందించి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా, అక్కడే చికిత్స పొందుతున్నాడు.

# బాల్య వివాహాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు.. డీసీపీవో బూర్ల మహేశ్




ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 6(సందేశం టైమ్స్) : బాల్య వివాహాల నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు డీసీపీవో బూర్ల మహేశ్ అన్నారు.ఆసిఫాబాద్ మండలం పర్సనంబాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహం చేయడం వల్ల చిన్నారుల భవిష్యత్తును నాశనం చేసినట్లు అవుతుందని, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. %బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎకడైనా బాల్య వివాహం జరిగితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 112, 1098కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్, ఎంపీవో మౌనిక, హెచ్‌ఎం వసంతరావు, సీడీఎస్ సూపర్‌వైజర్ లైలా, జెండర్ స్పెషలిస్ట్ రాణి, కౌన్సిలర్ చంద్రశేఖర్, శూర్ ఎన్జీవో ప్రతినిధులు దేవాజీ, ఉపాధ్యాయులు విట్టల్, మల్లేశ్, ఆత్మరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దాసరి సురేందర్ గ్యాంగ్ అరెస్ట్

సుబేదారి, నవంబరు 7(సందేశం టైమ్స్) : మోస్ట్ వాంటెడ్ క్రిమినల్, హైదరాబాద్ నగర బహిష్కరణకు గురైన దాసరి సురేందర్ అలియాస్ సూరీని వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఎనిమిది మంది ముఠా సభ్యులను ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్ మీడియా ఎదుట హాజరుపరిచారు. కరడుగట్టిన నేరస్తుడు సూరీ హైదరాబాద్ పోలీసులు నగర బహిష్కరణకు గురైన తరువాత వరంగల్ నగరంలోని భీమారంలో మకాం వేశాడు. ఏడుగురితో ముఠా ఏర్పాటు చేసుకున్నాడు.అక్టోబర్ 18న రాత్రి సమయంలో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని శాయంపేట మండలం మందారిపేట హైవే రోడ్డులో లారీ డ్రైవర్‌ను బెదిరించి రెండు బైకులలో పెట్రోల్ పోయించుకున్నాడు.

# పత్తి రైతు కన్నెర్ర.. తేమ పేరిట కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ఆగ్రహం

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబరు 7 (సందేశం టైమ్స్) :పత్తి కొనుగోళ్ల ప్రారంభం నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. తేమ పేరిట జిన్నింగ్ మిల్లుల్లో సేకరణ నిరాకరించడంతో కర్షకులు కన్నెర్ర చేస్తూ ఆందోళన బాట పట్టారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలోని జీవీపీ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. పలు గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు. తేమ శాతం 12కు మించి ఉందని తేల్చిన అధికారులు, కొనుగోళ్లకు నిరాకరించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు స్థానిక జాతీయ రహదారిపైకి చేరుకొని గంటకు పైగా రాస్తారోకో చేశారు. ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. %పోలీసులు అక్కడికి చేరుకొని ధర్నా విరమించాలని కోరారు. అధికారులు వచ్చి తమకు న్యాయం చేసే వరకూ వెనక్కి తగ్గేది లేదని భీష్మించుకూర్చున్నారు. అకాల వర్షాలతో పత్తిలో తేమ శాతం పెరిగిందని, 15 నుంచి 20 శాతం తేమ ఉన్న పత్తిని కూడా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఇక



పోలీసులు.. రైతులను బలవంతంగా లేపే ప్రయత్నం చేయగా, వాగ్వాదం చోటు చేసుకున్నది. ఒక దశలో వాంకిడి ఎస్ఐ మహేందర్‌కు.. రైతులకు మధ్య తోపులాట జరగగా, ఉద్రిక్తతతకు దారితీసింది. ఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దార్ రైతులను సముదాయించి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.వాంకిడిలోని జీవీపీ జిన్నింగ్ మిల్లులో గురువారం పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. తేమ 12 శాతానికంటే ఎక్కువగా ఉందని.. అధికారులు కొనుగోళ్లకు నిరాకరించడంతో రైతులు రోడ్డెక్కారు. దీంతో గంటకు పైగా పత్తి కొనుగోళ్లు సాగలేదు. కాగా, యేటా అధికారులు–జిన్నింగ్ మిల్లుల యజమానులు మిలాఖత్ అయి రైతులను నిలువుదోపిడీ చేయడం సర్వసాధరణమైంది. పంట చేతికి వచ్చే సమయంలో మొంథా తుపాన్ కారణంగా దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి.చేలల్లో ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి సైతం రాలిపోయింది.

(Sandesham Times) TG TEL/25/A0348“Title: Sandesham Times“Address: 3-82, Ananthagiri, Singavaram, Suryapet, Telangana – 508 206“Email:sandeshamtimes@gmail.com | Website: https://sandeshamtimes.com. Publisher & Printer: Amrutha Venkat Media Publication Private Limited,“3-82, Singaram, Ananthagiri Mandal, Suryapet District, Telangana – 508206“ Phone: 9052045435.“Printed at: Sunday Printing Press,“3-4297, Saraswathi Complex, SVN Colony, Guntur, Andhra Pradesh – 522 006